




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 3వ భాగం

అలా మార్క్స్ ను కలుసుకోవడానికి వచ్చిన కుర్రాడి పేరు ఫ్రెడరిక్ ఎంగెల్స్. చరిత్ర పుటల్లో మార్క్స్ ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ కూడా ఎంగెల్స్ పేరు లేకుండా వుండదు. ఈ ఎంగెల్స్ ఎవరు? అతని నేపథ్యం ఏమిటి? అనే విషయాలు క్లుప్తంగా తెలుసుకుందాం.

ఎంగెల్స్ తలి దండ్రులకు ఎనిమిది మంది సంతానం. వాళ్ళలో అందరి కన్నా పెద్దవాడు ఎంగెల్స్. వాళ్ళది కూడా జర్మనీయే. ఎంగెల్స్ పుట్టిన సంవత్సరం 1820. వాళ్ళ నాన్నకు వంశ పారంపర్యంగా టెక్స్ టైల్ మిల్స్ వ్యాపారం వుండేది. సాంప్రదాయబద్ధమైన క్రైస్తవ కుటుంబం వాళ్ళది. ఎంగెల్స్కు వూహ తెలిసిన దగ్గర నుండి సమాజంలోని అన్యాయాలను అర్థం చేసుకోవడం, వాటికి ఎదురు తిరగడం అలవాటే. అప్పుడప్పుడే జర్మనీలో పారిశ్రామిక రంగం శరవేగంగా విస్తరిస్తోంది. దానితో పాటే కార్మికుల సమస్యలు కూడా పెరుగుతూ వచ్చాయి. ఎంగెల్స్ని చాలా చిన్నవయసులోనే అవన్నీ చాలా ఆలోచింపజేసాయి. కాలేజీలో చదువుతున్నప్పుడే పారిశ్రామికరణ వలన జరుగుతున్న

నష్టాలూ, కార్మికులు అనుభవిస్తున్న కష్టాలూ ముఖ్యంగా వాళ్ళ నాన్న గారి ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థాల వల్ల కలుషితమవుతున్న నదీజలాలూ, అందులో పనిచేసే కార్మికుల దుర్భర పరిస్థితుల గురించి పత్రికల్లో వ్యాసాలు రాసేవాడు. ఇవన్నీ చూసిన ఎంగెల్సు అమ్మా, నాన్నలకు పెద్ద కొడుకు గురించి దిగులు పట్టుకుంది.

అందుకని చదువు మాన్పించేసి 17, 18 సంవత్సరాలకే తమ ఫ్యాక్టరీలో పని నేర్చుకుంటాడని ఎప్రంటీస్ గా చేర్పించారు. అంటే, ఎంగెల్సు వాళ్ళ నాన్న యజమానిగా వున్న ఫ్యాక్టరీలోనే కార్మికుడిగా చేరాడు. అక్కడ చేరిన దగ్గర నుండి యాజమాన్య వ్యతిరేక ధోరణులకు బీజం వేశాడు. ఇంకో ఆసక్తికరమైన సంగతి ఏమిటంటే... ఆ రోజుల్లో మీసాలు పెంచడం సభ్యతా, సంస్కారాలకు వ్యతిరేకంగా పరిగణించే వారట. ఎంగెల్సు మాత్రం తన వయసు కుర్రవాళ్ళని ఇరవై, పాతిక మందిని పోగుచేసి, వాళ్ళను కూడా మీసాలు పెంచమని ప్రోత్సహించి, అందరూ కలసి ఒక ఎగ్జిబిషన్ లాగ ఫ్యాక్టరీలో తిరుగుతుండేవారు. ఇవన్నీ గమనించిన ఎంగెల్సు అమ్మా, నాన్నలు, ఇలాగే జర్మనీ లో వుంటే కుర్రాడు ఇంకెంత రెచ్చి పోతాడోనని ఒక ఆలోచన చేశారు.

వాళ్లకు జర్మనీలోనే కాకుండా ఇంగ్లాండులోని మాంచెస్టర్ లో ఒక టెక్స్ టైల్ ఫ్యాక్టరీ వుంది. 'ఎంగెల్సు ని అక్కడకి పంపిద్దాం. అక్కడైతే అందరూ కొత్త వాళ్ళు వుంటారు. శుభ్రంగా పని నేర్చుకుంటాడు.' అని అభిప్రాయపడి ఎంగెల్సుని అతనికి 22 వయసులో బ్రిటన్ వెళ్ళమని పంపించారు. ఆ బ్రిటన్ వెళ్ళేటప్పుడు జర్మనీలో వున్న మార్క్సు ని కలుసుకున్నాడు. అప్పటికి మార్క్సు జర్మనీ లోనే పత్రికా సంపాదకుడిగా వున్నాడు. 1842లో తొలిసారిగా మార్క్సు ని కలుసుకున్నప్పుడు ఎందుకో గానీ ఒకరికి ఒకరు పొసగలేదు. చాలా ఆశ్చర్యంగా వుంటుంది. ఆ తరువాత జీవితాంతం మిత్రులుగా జీవించిన మార్క్సు, ఎంగెల్సుల తొలి పరిచయంలో ఒకరికి ఒకరు ఇష్టపడలేదు.

అక్కడ నుండి ఎంగెల్సు మాంచెస్టర్ వెళ్ళాడు. 1842 నుండి రెండేళ్ళ పాటు తన సొంత ఫ్యాక్టరీ లోనూ, బయట ఫ్యాక్టరీల్లోనూ కూడా పనిచేశాడు. వాళ్ళ నాన్నగారు అనుకున్నట్లుగా వ్యాపారం ఎలా చెయ్యాలో నేర్చుకోవడం కన్నా, కార్మికుల సమస్యల గురించీ, కార్మిక ఉద్యమాల గురించి ఎక్కువ అధ్యయనం చేయడం మొదలుపెట్టాడు. ఆ రోజుల్లోనే "ఇంగ్లాండ్ లోని కార్మిక వర్గ స్థితి గతులు " అనే పెద్ద వ్యాసం, పుస్తకం రాయడానికి శ్రీ కారం చుట్టాడు. ఆ వయసులోనే యెంత స్వేచ్ఛా భావాలతో, విప్లవ భావాలతో ఉండేవాడు అనడానికి ఇంకో ఉదాహరణ చెప్పుకోవాలంటే – తన ఫ్యాక్టరీలో పనిచేసే "మేరీ బౌన్స్ "అనే ఆమెతో సహజీవనం ప్రారంభించాడు. వాళ్ళిద్దరూ జీవితాంతం కలసే వున్నారు. కానీ, వివాహం మాత్రం చేసుకోలేదు. అంటే, వివాహపు తంతు మీద వాళ్ళిద్దరికీ నమ్మకం లేదు. 1844 లో ఇంగ్లాడు నుండి జర్మనీ వెనక్కి వెళ్ళేటటువంటి క్రమంలో మార్గ మధ్యంలో పారిస్ లో ఆగి, రెండోసారి మార్క్సు ని కలుసుకున్నాడు.

ఆ విధంగా ఎంగెల్సు జీవన ప్రవాహం, మార్క్సు జీవన ప్రవాహం తో కలసిన సంవత్సరం 1844 ఆగస్టు నెల. అప్పటికి మార్క్సు వయసు 26 సంవత్సరాలు. ఎంగెల్సు వయసు 24 సంవత్సరాలు. ఈసారి ఎంగెల్స్ మార్క్సుని

కలవడానికి కారణం ఏమిటంటే – మార్క్స్ పారిస్ లో వుండగా ఒకపత్రిక నడిపి, ఒక సంచిక మాత్రమే వచ్చి, ఆగిపోయింది అనుకున్నాం కదా! అందులో కూడా ఎంగెల్సు వ్యాసాలు రాసి వున్నాడు. ఆ పరిచయం కూడా వుండడం వలన మార్క్స్ ని కలుసుకుందామని అనుకున్నాడు ఎంగెల్సు. కానీ, విచిత్రంగా ఈ రెండోసారి కలుసుకున్నప్పుడు వాళ్ళిద్దరి అభిప్రాయాల్లో చాలా సామ్య భావం కనిపించింది. మార్క్స్ అంత వరకూ రాసినటు వంటి పేపర్లు ఎంగెల్సు చూసాడు. ఎంగెల్సు రాసినవి కొన్ని మార్క్స్ చూసాడు. వాళ్ళిద్దరి బంధం ఎంతగా అల్లుకుపోయిందంటే...ఆనాటి పరిచయం ఆ తరువాత జీవితాంతం మార్క్స్ బాగోగులన్నీ, ఎంగెల్సే చూసుకునేటంతగా కలిసింది.

ఎంగెల్సు అప్పటికే రాస్తున్న "ఇంగ్లాండులో కార్మిక వర్గ స్థితి గతులు " అనే పెద్ద వ్యాసానికి సహాయం కావాలి అని అడిగాడు ఎంగెల్సు, మార్క్సని. మార్క్స్ అప్పటికే కొన్ని విప్లవ వ్యాసాలు రాసి పత్రికలకు పంపిస్తుండేవాడు. అంతే కాకుండా, ఇద్దరూ కలసి "హోలీ ఫ్యామిలి" అని ఇంకో వ్యాసం రాద్దామని అనుకున్నారు ఆ సమయం లోనే.

అసలు ఈ 'హోలీ ఫ్యామిలి' అనేది ఏమిటంటే – 'హెగెల్' అనే తత్వవేత్త ఉన్నాడని గతంలో అనుకున్నాం కదా! ఆ 'హెగెల్' తత్వాన్ని సమర్ధిస్తున్న విప్లవ కారులను విమర్శిస్తూ, వీళ్ళు ఒక వ్యాసం రాద్దామని అనుకున్నారు. దాని పేరే "హోలీ ఫ్యామిలీ" అయితే, ఒకప్పుడు ఆ తీవ్రవాదులను వీళ్ళు సమర్ధించిన వాళ్ళే. ఈనాడు ఆ అభిప్రాయాలు మారాయి. ఇప్పుడు ఆ హెగెల్ తత్వంలో వున్న లోటు పాట్లను విమర్శిస్తూ రాద్దామని అనుకున్నారు. ఈ విధంగా ఒకరు రాసే వ్యాసాల్లో మరొకరు సహాయాలు చేసుకుందామని అనుకున్నారు.

ఎంగెల్సు ఒక రెండు వారాలు మాత్రమే పారిస్ లో వుండి, మళ్ళీ జర్మనీ తన అమ్మా, నాన్నల దగ్గరకు వెళ్లిపోయేటప్పుడు, తన దగ్గర ఉన్నటు వంటి డబ్బులు కొన్ని మార్క్స్ ఇచ్చాడు. అప్పటికే మార్క్స్ ఆర్ధికంగా ఇబ్బంది పడుతున్నాడని తెలుసు. అప్పుడే కాదు, మార్క్సను జీవితాంతం ఆర్ధిక ఇబ్బందులు వెంటాడుతూనే వున్నాయి.

ఎంగెల్సు అక్కడ నుండి వెళ్ళిన కొద్ది రోజులకి మార్క్స్ భార్య జెన్నీ, తమ పాపను తీసుకొని పారిస్ వచ్చింది. ఆమె రాగానే మార్క్స్, జెన్నీకి చెప్పాడు "ఎంగెల్సు అనే మిత్రుడు పరిచయం అయ్యాడు. మా ఇద్దరి భావాలు బాగా కలిశాయి. ఎందుకో జీవితాంతం అతనితో కలసి పనిచేస్తాననే భావన కలుగుతోంది."అని చెప్పాడు.

ఇలా జరుగుతూ వుండగా 1844 లోనే మార్క్స్ ఆ విప్లవ పత్రికల్లో రాస్తున్న వ్యాసాల గురించి ప్రష్యా ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించింది. వాళ్ళు ఫ్రెంచి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చారు. "మీ దేశంలో వున్న, మా దేశం కుర్రాడు, మామీద కుట్రలు పన్నుతున్నాడు. అతన్ని జాగ్రత్తగా చూస్తూ వుండండి." అని. దాంతో ఫ్రెంచి ప్రభుత్వం మార్క్స్ కదలికల మీద నిఘా వేసింది. మార్క్స్ మాత్రం ఎంగెల్సు అప్పజెప్పినటువంటి పేపర్లు రాయడం, తను రాస్తున్నటు వంటి వ్యాసాల్ని కొనసాగించడం చేస్తున్నాడు. అందువల్ల రాత్రుళ్ళూ, పగళ్ళూ కష్ట పడాల్సి వస్తుంది. మరొక

విషయం ఏమిటంటే, ఎంగెల్సు అప్పజెప్పినటువంటి పేపర్లు పూర్తి అయితే, దాన్ని ప్రచురణ కర్తలకు ఇస్తే, బదులుగా రాయల్టీ రూపంలో, తనకు కొంత ఆదాయం వస్తుంది. దాని గురించి కూడా రాత్రీ, పగలూ కష్ట పడుతున్నాడు.

ఇలా జరుగుతుండగా, 1845 జనవరి వచ్చేసరికి ఫ్రెంచ్ పోలీసులు తరచూ మార్క్స్ ఇంటికి రావడం, ఏం చేస్తున్నాడోనని విచారించి వెళ్ళడం, ఇలాంటివన్నీ జరగడం మొదలయ్యింది. ఇక్కడ కూడా స్థిరత్వం వుండదేమోనని, జెన్నీకి భయం పట్టుకుంది. అయితే, జెన్నీ భయపడుతున్న రోజు రానే వచ్చింది. అది 1845 జనవరి 20. రాత్రి పూట ఫ్రెంచి పోలీసులు హఠాత్తుగా వచ్చి, మార్క్సుకీ, మరికొంత మందికి "24 గంటల్లో పారిస్ వదిలి వెళ్ళిపోవాలని" నోటీసులు ఇచ్చారు.

ఉన్నట్టుండి ఎక్కడికి వెళ్తారు? పైగా 24 గంటల్లో. పెద్ద ప్రశ్నార్ధకం. పోనీ వెనక్కి 'ప్రష్యా' వెళ్లి పోదాము అంటే, ఆ ప్రష్యా వాళ్ళే ఈ ఫ్రెంచ్ పోలీసుల్ని నిఘా వెయ్యమని చెప్పింది. పైగా ప్రష్యా లో అడుగు పెడితే, వెంటనే అరెస్ట్ చెయ్యమని ఉత్తర్వులు కూడా వున్నాయి. మార్క్స్, అతని మిత్రులు కూడా  పోలీసులతో సంప్రదింపులు జరపడం ప్రారంభించారు. ఫ్రెంచ్ పోలీసులు ఒక షరతు పెట్టారు. "మేము ఎలాంటి రాజకీయ కార్య కలాపాల్లోనూ పాల్గొనము. అని హామీ పత్రం రాసి ఇస్తే గనక మిమ్మల్ని పారిస్ లోనే ఉండడానికి అనుమతి ఇస్తాము."అన్నారు. కొందరు మిత్రులు దానికి ఒప్పుకొని ఆ పత్రాల మీద సంతకం చేసి ఇచ్చారు.

కానీ, మార్క్స్, అతని విప్లవ భావాలు నమ్మిన  కొంత మంది మిత్రులు మాత్రం ఆ పత్రాల మీద సంతకాలు చెయ్యడానికి ఒప్పుకోలేదు. "ఏమైతే అదే అవుతుంది. ఈ పరిస్థితుల్ని ఎదుర్కొందాం"అని నిర్ణయం చేసుకొని సంతకం చెయ్యము అన్నారు. ఇదిగో మార్క్స్ లోని ఈ రాజీ లేని తత్వమే జీవితంలో ఆయనకు కష్టాలనూ తెచ్చిపెట్టిందీ, అద్భుతాలనూ తెచ్చి పెట్టింది. ఆ రాజీ పడని తత్వమే కేవలం ఆరు వారాల్లో పూర్తి చేస్తాను అనుకున్న "కేపిటల్" 16 సంవత్సరాల పాటు మధ్యలో ఆపకుండా కొనసాగేటట్లు చేసింది.

ప్రభుత్వం పెట్టిన షరతులకు లొంగలేదు కాబట్టి, పారిస్ వదిలి వెళ్లక తప్పని సరి వచ్చింది. కానీ, ఎక్కడకు ఎక్కడకు వెళ్ళాలి? ఆ సమయంలో మార్క్స్ కీ మరి కొంతమంది మిత్రులకు కనిపించినటు వంటి మార్గం ఏమిటంటే, పక్కనే వున్నది బెల్జియం. ఆ బెల్జియంలో వుంది 'బ్రసెల్స్'నగరం. అప్పటి కింకా బ్రసెల్స్ పెద్ద నగరం కాదు. ఒక మాదిరి పట్టణం లాగ వుండేది. 1845 ఫిబ్రవరి 2 న ఫ్రాన్స్ కి వలస వచ్చి కనీసం ఏడాదిన్నర అయినా పూర్తి కాకుండా మార్క్స్ బ్రసెల్స్ కి ప్రయాణం అయ్యాడు. ఆయన దగ్గర వున్నడబ్బుల్లో తనకి కావలసింది కొంత వుంచుకొని, ఒక 200 ఫ్రాంకులు భార్య జెన్ని కి ఇచ్చి"నేను ముందు బ్రసెల్స్ వెళ్తాను. అక్కడ ఇల్లూ, పరిస్థితులూ అన్నీ అనుకూలించాకా, వచ్చి మిమ్మల్ని తీసుకు వెళ్తాను. అంతవరకూ ఇక్కడే వుండండి" అని భార్యకు చెప్పి బయలుదేరాడు.

శరీరం గడ్డ కట్టే చలిలో, చౌకగా వెళ్ళాలి కాబట్టి, చాలా గ్రామాల మీదుగా ఆగుతూ...ఆగుతూ...మూడు రోజులు ప్రయాణించి, మొత్తానికి బ్రసెల్స్ చేరుకున్నాడు. అక్కడ మంచి నివాసంలో ఉండడానికి తగినన్ని డబ్బులు లేవు. అందుకని ఒక బోర్డింగ్ హౌస్ [లాడ్జి]లాంటిది వుంటే, దాంట్లో దిగాడు. కొత్త ఇంటి కోసం, కొత్త దేశంలో స్థిరపడడం కోసం అన్వేషణ ప్రారంభించాడు. ఇక్కడ పారిస్ లో జెన్ని 8నెలల పాపతో వుంది. భర్త దగ్గర నుండి ఎప్పుడు వుత్తరం వస్తుందా?ఎప్పుడు వెళ్దామా? అని ఎదురు చూస్తోంది. మార్క్స్ వెళ్ళిన ఒక వారం రోజులకి భర్తకు, జెన్నీ ఒక వుత్తరం రాసింది.

"నువ్వు 2oo ఫ్రాంకులు ఇచ్చివెళ్లావు?మనం కట్టాల్సిన అద్దె బకాయే 38o ఫ్రాంకులు అయ్యాయి. నాకు సహాయం గా నిలబడే వారు వున్నారు. కానీ, డబ్బులు ఇచ్చేవారు ఎవరూ లేరు. పోనీ, ఇంట్లో సామాను అమ్మేద్దామని నిన్న పారిస్ అంతా తిరిగాను. సరైన ధర ఇచ్చేవారు ఎవరూ కనిపించలేదు. అయినా సరే! నువ్వు భయపడవద్దు. నేను ధైర్యం కోల్పోవడం లేదు. బ్రసెల్స్ లో అయినా కాస్త మంచి ఇల్లు చూడు." అని వుత్తరం రాసి, తరువాత కొద్ది రోజులకి, ఇంట్లో వున్న సామాను అంతా వున్నకాడికి అమ్మేసి, ఆ బాకీలు తీర్చేసి, మిగిలిన కొద్ది పాటి డబ్బులతో, చిన్న పాప తో ప్రయాణమయి, బ్రసెల్స్ చేరుకుంది జెన్నీ.

కష్టాల సుడిగుండాలూ, ఇబ్బందుల ముళ్ళ బాటలూ అలవాటైపోయిన సంధి సమయం వాళ్ళిద్దరికీ కూడా. జెన్నీ బ్రెసెల్స్ వెళ్ళడంతో మార్క్స్,జెన్నీల జీవితంలో మరొక పరుగు మొదలయ్యింది.

అప్పుడు బెల్జియం పరిస్థితి ఎలావుంది అంటే,' రాజు' అధికారం లో వున్నాడు. రాజుతో పాటుగా చట్టబద్దమైన ప్రభుత్వం కూడా అధికారంలో వుంది. మార్క్స్ చర్యల గురించి, ఫ్రెంచ్, ప్రష్యా ప్రభుత్వాలు ముందుగానే బెల్జియం రాజుని హెచ్చరించాయి. "ఈ కుర్రవాడు మహా ప్రమాదకారి. జాగ్రత్తగా నిఘా వేసి వుంచండి."అని. అప్పుడు బెల్జియం రాజు కూడా మార్క్స్ తోటీ, అతని మిత్రుల తోటి ఒక హామి పత్రం రాయించుకున్నాడు.

"ఇక్కడ వున్నన్ని రోజులూ సమకాలీన రాజకీయాల గురించి గానీ, పక్క దేశాల రాజకీయాల గురించి గానీ ఏమీ రాయమూ, కార్య కలాపాల్లో పాల్గొనము."అని. తప్పనిసరి పరిస్థితుల్లో సంతకం చేశాడు మార్క్స్. ఎందుకంటే అప్పటికే రెండు దేశాలు వదలి వచ్చాడు. ఇక్కడైనా కొంత కాలం వుండాలి అనుకొని సంతకం చేశాడు గానీ, ఆ తరువాత బెల్జియం లో మూడు 3 సంవత్సరాలు మాత్రమే వున్నాడు. అంటే, 1845 నుండి 1848 వరకు. ఆ సంవత్సరాలలో తన చారిత్రాత్మక కార్యక్రమాలకు పునాది వేసుకున్నాడు. ఆ 3 సంవత్సరాలు రాజకీయ పార్టీ స్థాపించాడు. కార్యకర్తలను సమీకరించాడు. అత్యంత ప్రసిద్ధమైన "కమ్యునిస్ట్ మేనిఫెస్టో "కూడా ఈ 3 సంవత్సరాలలోనే రాశాడు.

మనం జాగ్రత్తగా గమనిస్తే, ఈ బెల్జియం వచ్చే సమయానికి ఆయన వయసు కేవలం 27సంవత్సరాలు మాత్రమే. పెళ్ళయి రెండు సంవత్సరాలు మాత్రమే అయింది. అప్పటికే రెండు దేశాలు బహిష్కరించాయి. ఇదిగో మూడవ దేశంలో వున్నాడు.

అప్పటికే ఎన్నో మలుపులు తిరిగింది మార్క్స్, జెన్నీల జీవితం. ఇక్కడ నుండి ఎన్ని మలుపులు తిరిగిందో తెలుసుకుంటే చాలా ఆశ్చర్యంగా వుంటుంది.

భార్య జెన్నీ, చిన్న పాపతో వచ్చేసరికి మార్క్స్ ఇంకా బోర్డింగ్ హౌస్ లోనే వున్నాడు. అక్కడ పసిపాపతో వుండడం చాలా ఇబ్బందిగా వుంది. అక్కడే మార్క్స్ విపరీతంగా ద్వేషించే ఒక కట్టడం కూడా వుంది. అదే చర్చ్. పోనీ అక్కడ నుండి వేరే ఇంటికి మారిపోదాము అంటే, అతని దగ్గర డబ్బులు లేవు. అలా వుండగా జర్మనీ నుండి ఎంగెల్స్, మరికొంతమంది మిత్రులు, ఈ కొత్త దేశంలో మార్క్స్ ఇబ్బందులు పడుతున్నాడని గ్రహించి, ఆయనకు ఒక వెయ్యి ఫ్రాంకులు పంపించారు. ఆ వెయ్యి ఫ్రాంకులతో ఒక సంవత్సరానికి సరిపడా అద్దె వస్తుంది. ఆ డబ్బులు వచ్చాక 'బ్రెసెల్స్' శివారు ప్రాంతంలో ఉన్నటువంటి ఒక ఇల్లు అద్దెకు తీసుకొని, అక్కడకు మారాడు భార్యా, పిల్లలతో.

ఆ ప్రదేశం అంతా చిన్న చిన్న పనులు చేసుకునే వారూ, కార్మికులూ వుండేవారు. అంతకు ముందు వుండే పారిస్ కూ, ఇక్కడకూ చాలా వ్యత్యాసం కనిపిస్తోంది జెన్నీకి. పారిస్ లో వున్నట్టు లక్షలాది మంది ప్రవాస జనులు బెల్జియంలో లేరు. అక్కడ జర్మనీ నుండి పారిపోయి వచ్చిన వారు 3, 4 వందల మంది మాత్రమే వున్నారు. పారిస్ లో వుండగా మార్క్స్ జీవితం ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమాలతో "ఫుల్ ఆఫ్ హై డ్రామా "అన్నట్లుగా వుండేది. ఇక్కడ ఇంకా హై ఎనర్జీ కార్యక్రమం ప్రారంభం కాలేదు. ఆయన పారిస్ లో వుండగా ప్రారంభించినటువంటి "హోలీ ఫ్యామిలీ" అనే పుస్తకాన్ని పూర్తి చేశాడు. అది పూర్తి అయితే కొంత డబ్బులు రావాలి.

ఆ సమయంలో అంటే 1845 మధ్య కాలంలో మార్క్స్, జెన్నీల జీవితంలోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఆ ఇద్దరు వ్యక్తులు కూడా మార్క్స్, జెన్నీ లకు జీవితాంతం సహాయకారులుగా, రక్షకులుగా సర్వస్వం అన్నట్లుగా వున్నారు.ఆ ఇద్దరూ విడి విడిగా వచ్చారు.కానీ, వీళ్ళతో కలసిపోయారు. ఆ ఇద్దరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు. ముందుగా ఆ మహిళ ఎవరో తెలుసుకుందాం. ఆమె పేరు "హెలెన్ దెముద్". ఆమె ఎలా వచ్చింది అంటే ,జెన్నీ అమ్మగారు, జెన్నీకీ, పసిపాపకీ సహాయకారిగా ఉంటుందని పంపించారు. ఇదే సమయంలో జెన్నీ రెండవ సారి గర్భవతి అని తెలిసింది. ఆ సమయంలో జెన్నీకి సహాయంగా ఎవరో ఒకరు తప్పనిసరిగా వుండాలని జెన్నీ అమ్మగారు అనుకొనే హెలెన్ ను పంపించారు. హెలెన్ అంతకుముందు 15సంవత్సరాలనుండి జెన్నీకి తెలిసిన మనిషే. ఈ హెలెన్ ఎవరంటే, జెన్ని అమ్మగారి ఊరైన ట్రియర్ దగ్గరగా వున్న ఊర్లోనే వుండేది. ఆమె అమ్మా, నాన్నలు చాలా పేదవాళ్ళు. వాళ్లకు చాలామంది పిల్లలు వుండేవారు. పిల్లలందరినీ పెంచలేక హెలెన్ ని 11ఏళ్ళ వయసులోనే హెలెన్ ని జెన్నీ అమ్మగారి ఇంట్లో

పనిమనిషిగా పెట్టేరు. అప్పటికి జెన్నీ వయసు 17సంవత్సరాలు. అంటే హెలెన్ కంటే 6సంవత్సరాలు పెద్దది. అప్పటినుండి కూడా జెన్నీ ఇంట్లోనే ఉండిపోయింది. జెన్నీ తమ్ముడ్ని కూడా చూసుకుండేది. జెన్నీ వాళ్ళ ఇంట్లో వున్నప్పటి నుండే మార్క్స్ కూడా తెలుసు. అంటే, ఆ ఇంట్లో ఉన్నప్పుడే మార్క్స్, జెన్నీ వాళ్ళ ఇంటికి రావడం అన్ని తెలుసు. ఆ విధంగా మార్క్స్, జెన్ని లు కొత్తేమీ కాదు.

1845 మే నెలలో బ్రసెల్స్ వచ్చిన హెలెన్ ఆ తరువాత జీవితాంతం వాళ్ళతోనే వుండిపోయింది. కేవలం పనిమనిషి గానే కాకుండా, వాళ్ళ కుటుంబంలో సొంత మనిషి లాగే జీవించింది. మార్క్స్, ఎంగెల్స్ ల రాజకీయ కార్యకలాపాల్లో కూడా హెలెన్ చురుగ్గా పాల్గొనేది. ఆ తరువాత ఆమెను వివాహం చేసుకుందామని చాలామంది ముందుకు వచ్చారు. కానీ, ఆమె అవివాహిత గానే ఉండిపోయింది. ఆ తరువాత రోజుల్లో మరో సంఘటన జరిగింది. అదేమిటో తరువాత తెలుసుకుందాం.

అదే సమయంలో మార్క్స్, జెన్నీల దగ్గరకు వచ్చిన మరో వ్యక్తి ఎంగెల్సు. అంటే, అంతకుముందు ఒకసారి వచ్చి వెళ్ళిపోయాడు. కానీ, ఈసారి వాళ్ళతో కలసి, వాళ్ళు ఉంటున్న పక్క ఇంట్లోనే ఉండడానికి ఎంగెల్సు వచ్చాడు.

8నెలల క్రిందట పారిస్ లో మార్క్స ని ఎంగెల్సు కలసి, తర్వాత జర్మనీ వెళ్ళిన తర్వాత ఏం జరిగిందో తెలుసుకుంటే..మళ్ళీ ఇప్పుడు బ్రసెల్స్ ఎందుకు వచ్చేశాడో తెలుస్తుంది.

పారిస్ లో మార్క్సని కలుసుకున్న తర్వాత తన స్వస్థలానికి వెళ్ళాడు ఎంగెల్సు. వాళ్ళ నాన్నగారి ఫ్యాక్టరీలోనే పనిచేద్దామనుకున్నాడు. అక్కడా మళ్ళీ ఇవే పనులు ప్రారంభించాడు. కార్మికుల పక్షాన నిలబడ్డం, తండ్రితో వాదనలు వేసుకోవడం ఇలాంటివన్ని. తండ్రికి చాలా ఇబ్బందికరంగా అనిపించింది. అందువల్ల "నువ్వు ఫ్యాక్టరీ లో పనిచెయ్యడం కన్నా మానేస్తేనే మంచిది."అన్నాడు. ఎంగెల్సుకి కావలిసింది కూడా అదే. పనిమానేసి ఇంట్లోనే వున్నాడు. ఇంట్లో కూడా సరిగ్గా ఉండకుండా, కమ్యునిస్ట్ నాయకులతో కలసి పని చెయ్యడం. పత్రికలకు వ్యాసాలు రాయడం చేస్తుండేవాడు. ఇవన్నీ గమనిస్తున్న ప్రష్యా ప్రభుత్వం ఎంగెల్సు మీద కూడా దృష్టి పెట్టింది. వాళ్ళ నాన్నకు భయమేసింది. ఇలాగే వుంటే, కొడుకుని పోలీసులు అరెస్ట్ చెయ్యడమూ, లేకపోతే ఇతని మీద ఆంక్షలు పెట్టడం లాంటివి జరిగితే, దాని ఫలితంగా తన వ్యాపారానికే ముప్పు వస్తుంది అని అభిప్రాయపడి కొడుక్కి ఏం చెప్పాడంటే...

"ఒరే అబ్బాయ్!మనకు డబ్బులకేమి కొదవలేదు. నీకు ఎన్ని డబ్బులు కావాలంటే అన్ని డబ్బులు తీసుకొని ముందు అర్జంట్ గా ఈ జర్మనీ వదలి వెళ్ళిపో !పరిస్థితులు చక్కబడినాక అప్పుడు వద్దువు గాని, ప్రస్తుతానికి ఇక్కడ నుండి అదృశ్యమవడం తప్పనిసరి."అని .

ఎంగెల్సు కూడా దానికోసమే ఎదురు చూస్తున్నాడు. ఎందుకంటే, మార్క్స అప్పటికే ఎంగెల్సుకి వుత్తరం రాసి వున్నాడు."నువ్వు కూడా బ్రసెల్స్ వచ్చేసేయ్. ఇక్కడ నుండే కార్యక్రమాలు చేద్దాం."అని. ఆ రెండు ఒకేసారి కుదిరేసరికి

ఎంగెల్సు కూడా బ్రసెల్స్ వచ్చేశాడు. మార్క్సు ఉంటున్న ఇంటి పక్కనే ఒక ఇల్లు తీసుకున్నాడు. పేరుకి ఏదో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు గానీ, ఎప్పుడూ మార్క్సు ఇంట్లోనే ఉండేవాడు.

అతను రావడంతో మర్క్సులో కొత్త ఉత్సాహం వచ్చింది. క్రమక్రమంగా బ్రసెల్స్ జీవితం వేగం పుంజుకోవడం ప్రారంభమయింది. పారిస్ లో ఉన్నప్పుడైతే బయటకు వెళ్ళడం, అందరితోనూ కలవడం వుండేది. ఇక్కడేమో మార్క్సు ఇంటికే అందరూ వస్తుండేవారు. వాళ్ళు గతంలో మార్క్సుతో పాటు పారిస్ నుండి వచ్చిన వాళ్ళు. అలాగే బ్రసెల్స్ లోని మరి కొంత మంది మిత్రులు.వీళ్ళందరూ కలసి భోజనాలు చెయ్యడం,కలసి కష్ట సుఖాలు మాట్లాడు కోవడం, ముఖ్యంగా తరువాత ఏం చెయ్యాలి? కార్యాచరణ రూపొందించడం ఎలా? ఇలాంటివి మాట్లడుకుండేవాళ్ళు.

అదే సమయంలో మార్క్సుకి "పొలిటికల్ ఎకానమీ"అనే పుస్తకం ఒకటి రాయండి" అని ప్రచురణ కర్తలు 1500 ఫ్రాంకులు అడ్వాన్సు ఇచ్చారు. అది జరుగుతున్న సమయంలోనే అంతకుముందు ఎంగెల్సు తో కలసి రాసిన పుస్తకాన్ని ప్రచురణకు పంపించారు. ఆ సందర్భంలో ఎంగెల్సు "దాని మీద వచ్చే రాయల్టీ అంతా నువ్వే తీసుకో. నాకు అక్కరలేదు. మా నాన్న ఇచ్చిన డబ్బులు నా దగ్గర వున్నాయి "అన్నాడు మార్క్సుతో. అందువల్ల కొద్ది రోజులైనా గానీ ఆర్థిక ఇబ్బందులు లేకుండా, కాస్త మామూలు జీవితం గడపడానికి అవకాశం దొరికింది.

సరిగ్గా అవే రోజుల్లో యూరప్ అంతటా వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. ఐర్లాండ్ లో బంగాళా దుంప పంటలు పూర్తిగా నాశనమైపోయాయి. పంటలు సరిగ్గా పండకపోవడంతో ఆహార పదార్థాల కరువు వచ్చి పడింది. పనుల కోసమని రైతులు పట్టణాల బాట పట్టారు. వాళ్ళందరూ పట్టణాలకి వచ్చేసరికి ఫ్యాక్టరీలు కార్మికులతో నిండిపోయాయి. మనుషులు వచ్చేసరికి కొత్త కొత్త ఫ్యాక్టరీలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కార్మికుల జీవితాలను ప్రత్యక్షంగా పరిశీలించడానికని ఎంగెల్సు,మార్క్సుని, తను గతంలో పనిచేసిన 'మాంచెస్టర్' తీసుకువెళ్ళాడు. ఎంగెల్సు పనిచేసినప్పటి కంటే, ఇప్పుడు కార్మికుల పరిస్థితులు మరింత దుర్భరంగా మారిపోయాయి. 1845లో అక్కడకు వెళ్లేసరికి, కార్మికులు యంత్రం లాగ మారిపోయారు.

నియమితమైనటువంటి పనిగంటలు లేవు. టెక్స్ టైల్ మిల్లులు పెరిగినప్పటికీ కూడా మిల్లుల యజమానుల దోపిడీ కూడా పెరిగింది. ఆనాటి పరిస్థితులు మాంచెస్టర్ లో ఎలా ఉండేవంటే, ప్రతి శనివారం కార్మికులకు జీతం ఇచ్చేవారు. అది కూడా – కార్మికులు క్లబ్బుల్లో వున్నప్పుడు, అక్కడకు తీసుకెళ్ళి ఇచ్చేవారు. దాంతోటి ఆ కార్మికులు ఇచ్చిన డబ్బులన్నీ అక్కడే ఖర్చు పెట్టేసేవారు. సోమవారం నుండి మళ్ళీ తిండికి ఇబ్బంది. ఖచ్చితంగా ఫ్యాక్టరీల్లో వాళ్ళ చేత పనిచేయించాలి. ఎక్కడికీ వెళ్ళకూడదు. అనే ఉద్దేశ్యంతో మిల్లుల యజమనులందరూ ఇలా కార్మికులను తాగుడుకి బానిసల్ని చేస్తుండే వారు.

వాళ్ళు నివసించే వంటి పరిసరాలు కూడా చాలా దుర్భరంగా ఉండేవి. అలాంటి పరిస్థితుల్లో ఆడవాళ్ళు కూడా తప్పనిసరిగా పని చెయ్యాల్సి వచ్చేది. మరి ఆడవాళ్ళు ఫ్యాక్టరీల్లో పనికి వెళితే, ఇంటి దగ్గర చిన్న పిల్లల్ని ఎవరు చూసుకుంటారు? అందుకని, చిన్న పిల్లలకు మత్తు మందులు వేసేసి, సాయంత్రం వరకూ పడుకో బెట్టేసేవారు. ఇవి చాలా భయంకరమైనటువంటి పరిస్థితులు. ఇవన్నీ 2oo సంవత్సరాల క్రితం ఇంగ్లాండ్ లోనని గుర్తు పెట్టుకోవాలి.[ ఆనాటి పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్టు ఎంగెల్సు "ఇంగ్లాండులో కార్మిక వర్గ స్థితి గతులు "అనే పుస్తకంలో రాశాడు. ఈ పుస్తకం తెలుగులో కూడా వుంది.]

పిల్లలకు ఆరు ఏళ్ళ వయసు వస్తే, తమతో పాటు పనికి తీసుకు వెళ్ళేవారు. ఆడపిల్లలైతే 1o, 12 ఏళ్ళకే పెళ్ళిళ్ళు చేసి, పంపించేసే వారు. ఇవన్నీ కూడా మార్క్సు ప్రత్యక్షంగా చూడడం మొదటిసారి. అంత వరకూ పుస్తకాలు చదవడం, చరిత్రను అధ్యయనం చేసి విశ్లేషణలు చేయడం, అలా చేసి వ్యాసాలు రాయడమే తప్ప ఇలా, మొట్ట మొదట సారిగా కార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూడడంతో, మార్క్సుకి కొత్త కోణాలు కనిపించాయి. భయంకరమైన ఈ వాస్తవాలు మార్క్సు ను మరింత అశాంతికి గురిచేశాయి. తను రాసిన ప్రతి పదానికీ ఒక కొత్త అర్థం కనిపించింది.

మాంచెస్టర్ లో ఒక 6 వారాలు వుంది, అక్కడ నుండి లండన్ వెళ్లారు. 'లండన్' అదొక భారీ నగర వాతావరణం. అక్కడ కూడా పేదరికం వుంది. కానీ, అది బయటకు కనిపించకుండా అడుగు పొరల్లో ఎక్కడో దాగి వుంది. లండన్ లోనే మార్క్సు, ఎంగెల్సులకు " లీగ్ ఆఫ్ జస్టిస్ " అనే ఒక రహస్య సంస్థ తో పరిచయం ఏర్పడింది.

ఈ "లీగ్ ఆఫ్ జస్టిస్ "అనే సంస్థ ఏమిటంటే...ఇది అంతకుముందు పారిస్ లోనూ, జర్మనీ లోనూ కూడా వుండేది. అయితే, అక్కడ వాళ్ళు నిలవలేని పరిస్థితుల్లో లండన్ వచ్చేశారు. అది రహస్య సంస్థ. బహిరంగంగా పనిచేయడానికి వీల్లేదు. ముఖ్యంగా జర్మన్ నుండి బహిష్కరించినవాళ్ళూ, జర్మన్ నుండి పారిపోయి వచ్చిన వాళ్ళూ ఈ "లీగ్ ఆఫ్ జస్టిస్"లో చురుకుగా వుండేవారు. అది రహస్య సంస్థ కాబట్టి, అందరికీ తెలిసిన రూపం ఒకటి వుండాలి కాబట్టి, వాళ్ళు "కమ్యూనిస్ట్ వర్కర్స్ ఎడ్యుకేటెడ్ ఆర్గనైజేషన్" అని ఒక పేరు పెట్టి, దాని ద్వారా కార్య కర్తల్ని తీసుకునేవారు. నిజానికి వాళ్ళు చేసేది "లీగ్ ఆఫ్ జస్టిస్ " సంస్థ, లేదా పార్టీ పనులు. దాని తాలుకా విప్లవ కార్యక్రమాలు బోధించడం, సమయం వచ్చినపుడు ప్రజలను విప్లవ పోరాటానికి సిద్దం చేయడం వారి పనులు.

ఈ "లీగ్ ఆఫ్ జస్టిస్ " సంస్థ "ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్ " అనే నినాదంతో పనిచేస్తుండేది. ఇదంతా మార్క్స్, ఎంగెల్సు లు మాంచెస్టర్ లో వుండగానే గమనించి, లండన్ వచ్చిన వెంటనే వాళ్ళను కలుసుకున్నారు. వాళ్ళ కార్యక్రమాలను పూర్తిగా అధ్యయనం చేశారు. ఇవన్నీ అయిపోయిన తర్వాత మళ్ళీ బ్రసెల్స్ చేరుకున్నారు.

వాళ్ళు ఉంటున్న దగ్గరకే ఎంగెల్సు తో సహజీవనం చేస్తున్న "మేరీ బౌన్స్ " కూడా వచ్చేసింది. ఇప్పుడు మార్క్స్, జెన్నీ లు ఒక ఇంట్లోనూ, ఎంగెల్సు, మేరీ బౌన్స్ లు ఒక ఇంట్లోనూ వుంటున్నారు. అక్కడ నుండి వాళ్ళ కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. ఇంగ్లాండ్ పర్యటన వాళ్ళిద్దరికీ మంచే చేసింది. మార్క్స్ కి ప్రత్యక్షంగా కార్మికుల సమస్యల్ని చూసే అవకాశం. అంతే కాకుండా ఆ స్నేహితులిద్దరూ 6 వారాలు కలసి వుండేసరికి, ఒకరిని ఒకరు మరింతగా అర్ధం చేసుకోవడం, జీవితంలో ఎప్పుడూ కూడా విడిపోకుండా కలసి పనిచెయ్యాలి. కమ్యునిస్ట్ భావాలను గానీ, సామ్యవాద సిద్ధాంతాలను గానీ ముందుకు తీసుకువెళ్ళడంలో ఒకరికి ఒకరు తోడుగా వుండాలి ఒక ఒప్పందం లాంటిది. అంటే, ఎక్కడా పేపరు మీద రాసుకోలేదు గానీ, ఒక నిర్ణయానికి వచ్చారు.

"ఇకపై నిజమైనటు వంటి ఉద్యమాలు నిర్మించాలి. ఇంత వరకూ పుస్తకాలు రాసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యాము. ఇలా కాకుండా ఒక అంతర్జాతీయ విప్లవ సంస్థ"ను నెలకొల్పాలి అని వాళ్ళిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇదంతా జరిగిన 2, 3 వారాలకి 1845 సెప్టెంబర్ 26 న జెన్నీ, మార్క్సులకు రెండవ సంతానం "లారా" ఆడపిల్ల జన్మించింది. అంటే, ఇప్పుడు ఇద్దరు చిన్న పిల్లలు. ఇద్దరు చిన్న పిల్లలతో ఇల్లంతా గందరగోళంగా వుండేది. భర్త రాసుకోవడానికి ఇబ్బంది అని జెన్నీ ఆలోచించి, ఏకాంతంగా ఉంటుందని మార్క్సుకి ఇంట్లోనే ఒక ప్రత్యేకమైన గదిని కేటాయించింది. సహాయకురాలు హెలెన్ వుంది కాబట్టి, భర్తకు సహాయపడడానికి జెన్నీ కి అవకాశం దొరికింది.

ఇంతలో మరొక ఉపద్రవం వచ్చి పడింది.

మార్క్స్, జెన్నీ లకు బాంబులాంటి వార్త. 1845 నవంబర్. వాళ్ళు బ్రసెల్స్ వచ్చి సంవత్సరం కూడా కాలేదు. ప్రష్యా ప్రభుత్వం "మార్క్సును బ్రసెల్స్ నుండి బహిష్కరించాలి" అని బెల్జియం ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడం ప్రారంభించింది. యెంత చిత్రంగా వుందో చూడండి. 27ఏళ్ళ వయసున్న కుర్రాడు. రెండు దేశాల్ని భయపెట్టాడు .ఆ రెండు దేశాలు కాకుండా మూడవ దేశంలో వుంటే, మొదటి రెండు దేశాలూ కలసి, మూడవ దేశం మీద ఒత్తిడి తేవడం మొదలు పెట్టాయి. జర్మనీ నుండి బెల్జియం వలస వచ్చిన వాళ్ళలో కొంత మందిని ఏజెంట్లుగా నియమించుకొని, వాళ్ళ ద్వారా మార్క్స్ యొక్క కార్యకలాపాలు గురించి తెలుసుకుంది ప్రష్యా ప్రభుత్వం. అటు వైపు ఫ్రాన్సు ప్రభుత్వం కూడానూ.

నిజానికి అప్పటివరకు మార్క్స్ పుస్తకాలు రాయడం తప్పా, నిర్మాణాత్మకమైన కార్యకలాపాలు ఏమీ చెయ్యడం లేదు. కాకపోతే ముందు జాగ్రత్తగా జర్మనీ చుట్టుపక్కల ఉండకుండా చూడాలి అనేది ప్రభుత్వం ఆలోచన. ఈ బెదిరింపులకీ, అలాగే క్షణక్షణం పెరిగిపోతున్న నిఘాలనీ గమనించిన మార్క్స్ ఏమి చేశాడంటే, తన సొంత నగరం అయిన 'ట్రయర్' మేజిస్ట్రేట్ కి ఒక వుత్తరం రాశాడు. "నేను అమెరికా వెళ్ళడానికి అనుమతి ఇవ్వండి" అని. ఎందుకంటే, అతను ఇంకా ప్రష్యా దేశం యొక్క పౌరుడే. వాళ్ళు అనుమతి ఇస్తే తప్ప, ఈ ఖండం వదిలి వెళ్ళడానికి వీలులేదు. వాళ్ళ దగ్గర నుండి ఇంకా జవాబు రాకముందే, మరి ఏం ఆలోచించుకున్నాడో గానీ, "తనే స్వచ్ఛందంగా ప్రష్యా పౌరసత్వాన్ని వదులుకున్నట్టుగా" వుత్తరం రాసేశాడు. దాంతో కార్ల్ మార్క్స్ ఏ దేశ పౌరసత్వమూ లేని వాడయ్యాడు. ఆయన పట్టుదల యెంత గట్టిదంటే, ఆ రోజునుండి అంటే 27 సంవత్సరాల వయసు నుండి ఆ తరువాత జీవించినంత కాలమూ ఏ దేశానికీ చెందని పౌరుడులాగ, ఒక విధంగా చెప్పాలంటే, "విశ్వ పౌరుడు" గా జీవితం కొనసాగింది.

ఈ పరిణామాల తర్వాత 1846లో మార్క్స్, ఎంగెల్సు మరికొంతమంది మిత్రులూ కలసి "కమ్యూనిస్ట్ కరస్పాండెన్స్ కమిటి" అనేటటు వంటి ఒక సంస్థను స్థాపించారు. ఈ సంస్థకు ప్రేరణ – వాళ్ళు లండన్ లో చూసినటువంటి "లీగ్ ఆఫ్ జస్ట్ "అనే పార్టీ. మార్క్స్ మొట్టమొదటి సారిగా ప్రత్యక్ష రాజకీయ కార్యకలాపాల్లోకి వచ్చింది ఇదిగో ఈ సంస్థ ద్వారానే. అంతకుముందు వరకూ కేవలం పుస్తకాలు రాయడం వరకే అతని మేధస్సు పరిమితమయ్యింది. మార్క్స్, ఎంగెల్సు ఈ "కమ్యూనిస్ట్ కరస్పాండెన్స్ కమిటి "సంస్థ కార్య కలాపాలు తీవ్రం చేసేటటువంటి క్రమంలో జెన్నీ ఇద్దరి పిల్లల్ని చూసుకోవడమే కాకుండా, మార్క్సుకు సెక్రటరీగా కూడా పనిచేసేది. ఇక్కడనుంచి ప్రారంభించి 1846, 1847 ఈ రెండు సంవత్సరాలలో మార్క్స్, జెన్నీల జీవితాలలో జరిగిన కొన్ని సంఘటనలు గురించి వచ్చే భాగంలో తెలుసుకుందాం. .

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

.

2019 అక్టోబర్ 15 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు
https://youtu.be/0XIkSjeEItI

COMMENTS